


భీమనపల్లిలో వేసవి క్రీడా శిక్షణా తరగతులు



శిక్షణ ఇస్తున్న అధికారులు తదితరులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వేసవి క్రీడా శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఎస్ఎంసి చైర్మన్ గుర్లింక చిన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాలీబాల్, క్రికెట్,ఫుట్ బాల్ పోటీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు నాగులపల్లి శేషవేణి, పీడీలు కామన మధుసూదనరావు, కరాటం ప్రసాద్,కె.రాము తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో నాలుగింతలు

- ఈ ఏడాది భారీగా పెరిగిన పసిడి ధరలు
- కొనుగోలుకు సామాన్యులు వెనకడుగు
- కార్పొరేట్ రాకతో స్థానిక షాపులు వెలవెల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బంగారం ధర పదేళ్లలో నాలుగింతలైంది. ఈ ఏడాది రూ.లక్ష దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గుదల ఉన్నా... ఇది తాత్కాలికమే అంటున్నారు వ్యాపారులు. రాబోయే కాలంలో పెరగడమే తప్ప తగ్గే అవకాశం ఉండదంటున్నారు. సామాన్యులు కొనలేని స్థాయికి నేడు బంగారు ధర చేరింది. ధనిక, పేద అనే తేడా లేకుండా పెళ్లిళ్ల, శుభకార్యాలు అంటే ముందుగా గుర్తుకొచ్చేది బంగారమే. ధనవంతులు కాస్త ఎక్కువగా, మధ్య తరగతి ప్రజలు వారి స్తోమతకు తగ్గట్టుగా బంగారు నగలను కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది పసిడి ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. ఎప్పటికప్పుడు పసిడి ధరలు ఆల్‌టైం రికార్డులను నమోదు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు బంగారంపై ఉంచు తున్నారు. అమెరికా, చైనా దేశాల మధ్య జరుగుతున్న ఆర్థిక యుద్ధం నేపథ్యంలో దేశంలో బంగారు ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది బంగారం గ్రాము ధర రూ.9,878గా ఉంది. గడిచిన పదేళ్లలో గ్రాముకు రూ.7078 పెరిగింది. వెండి ధరలు సైతం పరుగులు పెడుతున్నాయి. గడిచిన 50 ఏళ్లలో పెరిగిన ధర ఒక ఎత్తయితే ఈ పదేళ్లలో పెరిగిన ధర అధికం అనడంలో ఎం మాత్రమూ అతిశయోక్తికాదు. బంగారం ధరల పెరుగుదల, మరో వైపు కార్పొరేట్ సంస్థలు రాకతో స్థానిక వ్యాపారాలు పూర్తిగా వెల వెల బోతున్నాయి. ఆభరణాల తయారీ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లిపోతున్నారు.



రాజమహేంద్రవరంలో 200లకు పైగా షాపులు

అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య పోరుతో పాటు డాలర్ బలహీనపడడం వంటి కారణాలతో మదుపరులు బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే కాకుండా ప్రభుత్వం గోల్డ్ నిల్వలు పెంచుకుంటూ ఉంది. యుఎస్ ఎకానమీ పడిపోవడం, డాలర్ మీద నమ్మకం సన్నగిల్లడంతో బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం 3,319 డాలర్లకు చేరువలో ఉంది. బంగారం ధర రోజు రోజుకు పెరుగుతుండటంతో మార్కెట్ వెలవెలబోతోంది. గడిచిన వారంలో పసిడి ధర గ్రాముకు రూ.200పైనే పెరిగింది. గత ఏడాది చాలాకాలం గ్రాము బంగారం రూ.5400 నుంచి రూ.5900 మధ్యనే ఉంది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల ప్రభావం బులియన్ మార్కెట్‌పై చూపింది. దీంతో ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడంతో ధర ఆకాశాన్ని అంటింది. జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాల్లో అత్యధికంగా బంగారం దుకాణాలు ఉన్నాయి. అత్యధిక వ్యాపారం రాజమహేంద్రవరంలో జరుగుతోంది. మెయిన్ రోడ్డు, గోకవరం బస్టాండ్, ఎవి అప్పారావు రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు, ఇతర చిన్న షాపులు కలిపి 200పైగా ఉన్నాయి. ప్రస్తుతం ధర పెరగటంతో వినియోగ దారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత తగ్గ తుందన్న ఆశతో అవసరం ఉన్నా ఆ స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. దీంతో జ్యూయలరీ షాపుల్లో సందడి కనిపించడం లేదు. దీనికి తగ్గట్టు వెండి కూడా దూసుకుపోతోంది.

పెళ్లిళ్ల సీజన్ అయినా కొరవడిన సందడి

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో కళ కళలాడాల్సిన బంగారం షాపులు వెలవెల బోతున్నాయి. ఓ వైపు ధరలు పెరగటం మరో వైపు, కార్పొరేట్ సంస్థలు రాక ప్రధాన కారణమని జ్యూయలరీ షాపుల యజమానులు చెబుతున్నారు. 2013లో రూ.2,920 ధర ఉండేది. 2014లో రూ.2,800, 2015లో రూ.2,634, 2016లో రూ.2,862కు చేరింది.2017లో రూ.2,900, 2018లో రూ.3,000, 2019లో రూ.3,200చేరింది. 2020లో రూ.3,50 నుంచి రూ.4200, 2021లో రూ.4,800, 2022 రూ.5,300, 2023లో రూ.6,200 చేరింది. తాజాగా రూ.7450కి చేరింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 10 వేలకు పైగా కార్మికులు ఆభరణాల తయారీ రంగంలో ఉపాధి పొందేవారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరికరాలు రావటం, ధరలు పెరుగుదల, కార్పొరేట్ సంస్థలు రెడీమెడ్ వ్యాపారం ప్రారంభించటంతో కార్మికులకు ఉపాధి కొరవడింది. దీంతో సుమారు 40 శాతం మంది ఇతర రంగాలకు తరలి వెళ్లినట్లు జ్యూయలరీ వర్కర్స్ చెబుతున్నారు. బంగారు ఆభరణాల కోసం ఇతర జిల్లాల నుంచి సైతం గతంలో రాజమహేంద్రవరం వచ్చే వారని ప్రస్తుతం స్థానికులు సైతం రెడీమెడ్‌పై ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది.

బంగారం ధరలు క్రమంగా పెరుగుదల

బంగారం ధరలు క్రమ క్రమంగా పెరగటమే తప్ప తగ్గే పరిస్థితులు కన్పించటంలేదు. రాజమహేంద్రవరంలో కిరాణా స్టోర్స్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాను. ప్రతి సంవత్సరమూ అక్షయ తృతీయ, సంక్రాంతి, దసరా పండుగకు బంగారం ఆభరణాలు కొనుగోలు చేస్తుంటాను. గత ఐదేళ్లలో ధరలు విపరీతంగా పెరగటంతో వెనకడుగు వేయాల్సి వస్తోంది. గతంలో తయారీ చేయించే వాళ్లము. ప్రస్తుతం మోడల్స్ అందుబాటులో ఉండటంతో రెడీమేడ్ కొంటున్నాము.

- కె.వెంకటేశ్వరరావు సీతం పేట, రాజమహేంద్రవరం

ఆభరణాల వ్యాపారం ఆశాజనకంగా లేదు

బంగారు ఆభరణాలు తయారీ, విక్రయం రంగంలో గత మూడు దశాబ్దాలుగా పని చేస్తున్నాను. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో విరివిగా ఆర్డర్లు వచ్చేవి. మా కుటుంబంతో పాటు మరో ఐదుగురు మా షాపులో ఉపాధి పొందేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. కార్పొరేట్ సంస్థలు గడిచిన ఐదేళ్లలో 5కు పైగా భారీ షాపులు ఏర్పాటు చేశాయి. దీంతో స్థానిక వ్యాపారాలు పడిపోయాయి. పండుగలకు, గతంలో తయారీ చేయించే వారు సైతం ప్రస్తుతం రెడీమేడ్ కొనుగోలు చేయటంతో ఉపాధి కొరవడింది.

- కె.భాస్కరాచారి, మెయిన్ రోడ్డు

ధాన్యానికి దక్కని మద్దతు ధర

- మిల్లర్లు దళారులు బస్తా రూ.1500లకు కొనుగోలు
- అయోమయంలో రైతులు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం రాశి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఒకవైపు అనుకూలించని వాతావరణంతో రైతులు సతమతమవుతున్నారు. పగలు ఎండ. రాత్రి వర్షంతో పండించిన ధాన్యాన్ని దాచుకోవాలో అమ్ముకోవాలో తెలియక రైతులు అయోమయాన్ని గురవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.1725లు ఉంది ఇదే సమయంలో రైస్ మిల్లర్లు, దళారులు కుమ్మక్కై బస్తాకు రూ.1450 నుంచి రూ.1500 చెల్లిస్తున్నారు. దీంతో రైతులు 200 పైగా నష్టపోతున్నారు. వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని కొందరు రైతులు ఏదోలా విక్రయిస్తున్నారు. మరికొంద రైతులు ధర పెరిగిన తర్వాత అమ్ముకోవచ్చునని ధాన్యాన్ని మెయిన్ రోడ్ల వెంబడి రాశులు పోసి బరకాలు కప్పి ఉంచుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తూకం వేసేందుకు సిబ్బంది లేరు. దీంతో రైతు వచ్చి స్వయంగా సంచులు పట్టుకెళ్లాం దాన్ని తూకం వేయడం లోడింగ్ కష్టంగా మారుతుంది. దళార్లకు అమ్మితే నేరుగా దళారి జట్టుకూలీలతో వచ్చి తూకం వేసుకొని లోడింగ్ చేసుకుని వెళ్లిపోతాడు. రైతుకు సొమ్ము నేరుగా చెల్లిస్తాడు. ఇది సులువుగా ఉండటంతో రైతులు దళారులకే ఆయన కాడికి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర రైతులకు దక్కేలాగా చర్యలు తీసుకోవాలని రైతులందరూ కోరుతున్నారు.

పదిలో మెరిట్ విద్యార్థులకు సత్కారం



అమలాపురంలో విద్యార్థిని హెబ్సిబను అభినందిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - యంత్రాంగం

పదో తరగతి ఫలితాల్లో మెరిట్ కనబరిచిన విద్యార్థులను పలువురు శనివారం సత్కరించారు.

అమలాపురం: పట్టణ మండల స్థాయిలో 2024-25 విద్యా సంవత్సరంలో పదోవ తరగతి ఫలితాలలో స్థానిక గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని చిరంజీవి షైని హెబ్సిబ 585 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్. షేక్ సలీమ్ బాషా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు: పదోవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కుసుమ భవ్యశ్రీ దుర్గను దళిత చైతన్య వేదిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు జిల్లా రాజోలు మండలం కూనవరం గ్రామానికి చెందిన కుసుమ భవ్య శ్రీదుర్గ కూనవరం ప్రభుత్వ హైస్కూల్ నుంచి 600 మార్కులక 579 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవడం పట్ల దళిత చైతన్య వేదిక నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుసుమ భవ్యశ్రీ దుర్గను దళిత చైతన్య వేదిక నాయకులు ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువా, జ్ఞాపికలతో శనివారం కూనవరంలో సత్కరించారు. కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, మట్టా సురేష్ కుమార్, నల్లి నాగబాబు, చిలకపాటి శ్రీధర్, చింతా శ్రీనివాస్, మోకా సురేష్, చిల్లింగి త్రినాధ్ రావు తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో విద్యార్థిని భవ్యశ్రీకి అభినందన

మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి - కొత్తపేట

నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. దీనిలో భాగంగా కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామానికి రూ.1.45 కోట్లు, ఆలమూరు మండలం మడికి గ్రామానికి రూ.1.14 కోట్లు నిధులు నాబార్డు నిధుల నుంచి ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు.అమలాపురం - రావులపాలెం ప్రధాన రహదారి నుండి మోడేకుర్రు గ్రామానికి, మడికి గ్రామం నుండి చిలకలపాడు గ్రామం వరకూ ఈ రోడ్ల నిర్మాణం చేపడతారని వివరించారు. అత్యవసరమైన కొన్ని గ్రామాల్లోని నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు.వాటి నిధుల మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొత్తపేట పంచాయితీ పరిధిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు ఎంఎల్ఎ ఒడారు సత్యానందరావు స్థలాన్ని పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని రైతు బజార్ ప్రక్కన ఉన్న సత్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు. బూసి భాస్కరరావు , కొత్తపేట గ్రామం ఉప సర్పంచ్ వీళ్ళ మారుతి ప్రసాద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

ఇంటింటా సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటింటి సర్వే పనులు వేగవంతం కావాలని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. మండలంలోని బడుగువానిలంక గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని గ్రామస్తులను ఆయన కోరారు. అలాగే పారిశుధ్య పనుల్లో భాగంగా సిబ్బందికి చెత్త నుండి సంపద తయారీపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అలాగే తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధానాన్ని మండలంలో గల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కూడా కల్పించడం జరిగిందన్నారు. అలాగే సేకరించిన చెత్త నుంచి సంపద ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ మండల పరిధి అన్ని గ్రామాల పంచాయతీల సిబ్బందికి ఇచ్చామన్నారు. దీనిని వలన గ్రామంలో పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుందని ఆయన వివరించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూసి షెడ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చింతా వెంకట రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ ఎ.రాజు

12న మహా రణభేరి కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఐ.పోలవరం

పాతఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎదుర్లంక వారధి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే మాలల మహా రణభేరి-మే 12న ఛలో కాకినాడ కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు.మాల మహానాడు నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేస్తూ ఆర్డినెన్స్ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు గైడ్ లెన్స్ కు వ్యతిరేకంగా చట్టబద్ధత లేని డేటాతో ఒన్‌మాన్ కమీషన్ ఇచ్చిన రిపోర్టు ఆదారంగా చేసిన ఎస్‌సి వర్గీకరణ చెల్లదన్నారు. దీనికి నిరసనగా జరిగే సభకు మాలలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేవు శ్రీను, పెయ్యల పరాశరామూడు, కాశి పరివాజ్ కుమార్, మట్టా గగనవీరుడు, బీర సత్యనారాయణ, జల్లి శ్రీనివాస్, యలమంచిలి బాలరాజు, వడ్డి గౌతమ్, పండు విజయ్ కుమార్, ములపర్తి శ్రీను, కొండేపూడి సురేష్, సాధనాల బాబురావు,వెంటపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

మహేష్‌కు టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలం సిరి పల్లి గ్రామానికి చెందిన ఐటిడిపి అధ్యక్షులు అప్పారి మహేశ్వరావు(మహేష్) తండ్రి వసంతరావు ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు మాజీ చైర్మన్, పి గన్నవరం టిడిపి కన్వీనర్ నామన రాంబాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ సందర్భంగా నామన ఫౌండేషన్ ద్వారా అయిన రూ.10 వేలు మహేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంబిసి కన్వీనర్ పెంద్రా రమేష్ విలస గ్రామ శాఖ అధ్యక్షులు అక్కిశెట్టి దుర్గారావు, సిరిపల్లి టిడిపి గ్రామ శాఖ కుంచే చంద్రకాంతుడు, మట్టపర్తి అచ్చుత్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండపేట

రాయవరం మండలంలో రాయవరం గ్రామంలో పలు అభివద్ధి కార్యక్రమాలను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయవరం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోషల్ వెల్ఫేర్ బాలిక హాస్టల్‌కు మార్పు చేశారు. ఈ హాస్టల్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. అలాగే గ్రామపంచాయితీ 15వ ఆర్థిక సంగం నిధులతో నిర్మించిన సిసి రోడ్డు ను, మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సిసి రోడ్డు ను, ప్రారంభించారు.రాయవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన మహిళలకు కుట్టుమిషన్లు శిక్షణా కేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద శెట్టిబలిజ సంఘం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని, సచివాలయం-2 లో బాలబాలికలకు ఏర్పాటుచేసిన కిశోరి వికాసం వేసవి శిక్షణా కేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, టిడిపి నాయకులు ఉండవల్లి రాంబాబు, జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి, ఎంపిడిఒ ఎన్.కీర్తి స్పందన, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎన్ఆర్ఇజియస్ ఎపిఒ జె.సుధారాణి, వెలుగు (మహిళా సమాఖ్య) ఎపిఎంకె.నాగేశ్వరరావు, ఎంఇఒ వై.సూర్యనారాయణ, రామచంద్రపురం డివైఇఓ పి.రామలక్ష్మణమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు, సిడిపిఓ ఎ.గజలక్ష్మి తదితరులు, పాల్గొన్నారు.



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు



ఒఆర్ఎస్ ప్యాకెట్‌లు అందించిన హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్

వడదెబ్బపై ఉపాధి కూలీలకు అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో తొండవరం గ్రామం ముహూర్తాల చెరువు ఏరియాలో ఉపాధి హామీ శ్రామికులకు వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ లక్షణాలపై తీసుకోవలసిన రక్షణ చర్యలపై శనివారం హెల్త్ అసిస్టెంట్ జెవిఎస్ఆర్.ప్రసాద్ అవగాహన కల్పించారు. ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

అండర్-9 జిల్లా స్థాయి చెస్ పోటీల నిర్వాహణ

ప్రజాశక్తి - అమలాపురం


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి చెస్ ఎంపికలు 'నివారం విక్టరీ అకాడమీలో ఉత్సాహంగా జరిగాయని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ బాలురిలో ఇద్దరు, బాలికలలో ఇద్దరిని ఎంపిక చేసి విజయవాడలో జరుగుచున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పంపించామన్నారు. జిల్లా నలుమూలల నుండి 30మంది తొమ్మిదేళ్ల లోపు బాలబాలికలు పాల్గొన్న ఈ పోటీలలో బాలుర ప్రథమ స్థానం పడాల శ్రీయాన్ రెడ్డి, ద్వితీయ స్థానం తాడి చేతన్ హర్ష సాధించారన్నారు. బాలికలలో బొడ్డు సాన్వి ప్రథమ స్థానం, ఉచ్చుల లియాన ద్వితీయ స్థానం సాధించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పతకాలు బహూకరించారు.

బిసి కులగణన బిఎస్‌పి విజయం

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రం జనగణనతో పాటు బిసి కులగణన జరపాలని నిర్ణయించడం వెనుక బహుజన్ సమాజ్ పార్టీ 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఉంది అని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ కాంద్రేగుల నరసింహ, మరో జిల్లా ఇన్‌ఛార్జి కాశీ లక్ష్మీ భవాని, జిల్లా ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, జుత్తుగ సత్యన్నారాయణ, అమలాపురం ఇంచార్జ్ పొలమూరి మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కిశోర వికాసంపై అవగాహన



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మాణిక్యం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల కిశోర వికాసం-2పై శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. కిశోర బాలికలకు పలు అంశాలపై అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు.

కపిలేశ్వరపురం: మండపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కపిలేశ్వరపురం మండలం లోని 19 గ్రామాల్లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో కిశోరి వికాసం-2 వేసవి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాలు మేరకు శనివారం ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వికాసం-2 శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూవేసవి ఈ శిక్షణా కార్యక్రమం జూన్ 10 వ తేదీ వరకు జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలందరినీ, 20 మంది ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారికి రుతుక్రమం, పరిశుభ్రత,పరిపూర్ణ ఆరోగ్యం, లింగ వివక్షత, ఉన్నత విద్య,పోషణ అవసరాలు,పిల్లల సంరక్షణ, అక్రమ రవాణా, ఫోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధచట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మామిడికుదురు: పి గన్నవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పాశర్లపూడి లంకలో శనివారం కిషోర్ వికాసం -2 పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని వాటిని ఎవరూ ప్రోత్సహించరాదని సర్పంచ్ తెల్లగారెడ్డి సూర్యప్రకాశ రావు అన్నారు ఒకటి నుంచి 18 ఏళ్ల లోపు కిషోర్ బాలికలకు రుతుక్రమము, పరిశుభ్రత, పరిపూర్ణ ఆరోగ్యము, లింగ వివక్ష, ఉన్నత విద్య, అక్రమ రవాణా చట్టం, బాల్య వివాహ నిషేధచట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు చెరుకూరి పార్వతీదేవి, జనసేన నాయకులు చెరుకూరి సత్తిబాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఎఎన్ఎం, ఆశా వర్కర్స్ అంగన్‌వాడీ వర్కర్, కిశోర బాలికలు పాల్గొన్నారు



పాశర్లపూడి లంకలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన

నేరాలు ఘోరాలు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

వీడిన హత్య కేసు మిస్టరీ -భార్యే హంతకురాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల చేబ్రోలు బైపాస్ రోడ్‌లో హత్య చేసి పడవేసిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ధర్మవరానికి చెందిన తంగెళ్ల లోవరాజును భార్య ఆమె ప్రియుడు మరో వ్యక్తితో కలిసి కత్తులతో పొడిచి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. శనివారం జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు. చేబ్రోలు గ్రామ శివారు బైపాస్ రోడ్‌లో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్యాంప్ కార్యాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మార్చి 3న పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని గుర్తుపట్టే వీల్లేకుండా శరీరంపై కత్తిపోట్ల ఆనవాళ్లు ఉండడంతో హత్యగా నిర్ధారించారు. మృతుని చేతికి ఉన్న రాగి కడియం, అల్లికతో ఉన్న తాడు తప్ప మరే ఆధారం లేదు. డిఎస్‌పి దేవరాజ్ మనీష్ పాటిల్, సిఐ జి.శ్రీనివాస్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి. యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదుపై గొల్లప్రోలు పోలీసులకు సమాచారం రాగా సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు.

యలమంచిలి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తంగెళ్ల లోవరాజుకు ఏలూరుకు చెందిన శ్యామలతో వివాహం అయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యామలకు వరసకు బావ అయ్యే మాడెం మోహన్ కుమార్‌తో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఇది గమనించిన భర్త లోవరాజు భార్యతో పాటు మోహన్ కుమార్‌ను హెచ్చరించాడు. దీంతో భార్య శ్యామల, ప్రియుడు మోహన్ కుమార్, అతడి స్నేహితుడు బల్ల గంగాధర్ రావు కలిసి లోవరాజును హత్య చేసేందుకు పథకం రచించారు. లోవరాజు కంపెనీలో పని ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోతున్న సమయంలో మోహన్ కుమార్, గంగాధర్‌రావు ఆపరేషన్లకు ఉపయోగించే సర్జికల్ కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకుని వచ్చి చేబ్రోలు బైపాస్ రోడ్డులో కాలువ ఒడ్డున పడవేశారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు శ్యామల, మోహన్ కుమార్, గంగాధర్‌రావును అరెస్టు చేశారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామానికి చెందిన జన్నీ రాంబాబు(50) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడిన ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శనివారం కానూరు అగ్రహారంలో ఎండిన రొయ్యల చెరువులో మట్టి దున్నుతుండగా చెరువుగట్టుపై నుంచి ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి రాంబాబు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

స్థానిక గోష్పాద క్షేత్రంలోని లాంచీల రేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, వివరాలు తెలిసినవారు కొవ్వూరు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఆయన కోరారు.

5 నుంచి ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - మండపేట

మండపేట పురపాలక సంఘం పరిధిలో ఈనెల 5 నుండి 15వ తేదీ వరకు జరిగే ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని మండపేట పురపాలక సంఘ కన్వీనర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆధార్ క్యాంప్ షెడ్యూల్ వివరించారు. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు మండపేట తరవాణిపేట 3 సచివాలయంలోను, మండపేట ఎస్-ఎస్‌వివి.మున్సిపల్ హై స్కూల్ నందు, 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండపేట దళిత పేట సచివాలయంలోనూ, మండపేట గొల్లలగుంట 1 సచివాలయంలోనూ, ఈ ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ ఆధార్ క్యాంపులకు 0-6 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు బాల ఆధార్, 5-15 సంవత్సరాల మధ్య వయస్సు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ సర్వీసులను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు నీట్ పరీక్ష

ప్రజాశక్తి - యానాం

ఆదివారం జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు యానాం మెట్టకూరులో జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రంగా ఎంపిక చేయడంతో నిబంధనల మేరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు. మొత్తం 134 మంది అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాయనుండగా ఎలాంటి అవకతవకలు జరగకుండా జామర్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శరత్ చంద్ర కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - యానాం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మంజూరైన బీమా సొమ్మును ఆర్ఎఒ మునిస్వామి బాధిత కుటుంబానికి అందజేశారు. కురసాంపేటకు చెందిన పాలెపు దుర్గాభవాని గత ఏడాది సెప్టెంబర్ 13న ఇంటివద్ద చీరకు నిప్పంటుకోవడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. గ్రూప్ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షలు విలువ చేసే పత్రాలను మృతురాలి కుమార్తె గాయత్రి ప్రణీతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి గొంతియ్య పాల్గొన్నారు.

వేడెక్కుతున్న వాతావరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక పక్క ఎండలు... మరో పక్క కార్మికులు, స్కీమ్ వర్కర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది సమస్యలపై పోరాటాలతో ఉమ్మడి జిల్లాలో వాతావ'రణం' వేడెక్కుతోంది. కూటమి సర్కారు అవలంబిస్తున్న విధానాలు ప్రజలను సంతృప్తి పరచలేకపోతున్నాయి. ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకపోవడంతో పలు సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. కొన్ని విధానాల వల్ల కొన్ని వర్గాల ప్రజలు ఉపాధికి సైతం దూరమవ్వడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. 1-19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, పాత పద్ధతిలోనే హెల్త్ విధానాన్ని అమలు చేయాలంటూ ఆర్‌టిసి కార్మికులు రిలే దీక్షలకు దిగారు. ఎంటిఎస్ అమలు చేయాలంటూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు సమ్మెకు పూనుకున్నారు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని, నెలకు వేతనం రూ.7,800 మాత్రమే ఇస్తున్నారని, కాంట్రాక్టు గడువు ముగుస్తున్నందున్న ప్రభుత్వమే 102 వాహనాలను నిర్వహించాలంటూ తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లు తాజాగా ఆందోళనకు దిగారు. కాకినాడ పోర్టులో ఎగుమతులు, దిగుమతులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ పోర్టుకార్మికులు వేడుకుంటున్నారు. ఇక స్కీమ్ వర్కర్ల సమస్యల పరిస్థితి సరేసరి. వారి సమస్యలను పరిష్కరించిన దాఖలు ఎక్కడా లేవు. ఈ నేపథ్యంలో జరిగిన మేడే వేడుకలు ఈ సారి ప్రత్యేకం. సమస్యలను ఎదుర్కొంటున్న ప్రతి శ్రామికుడూ, ఉద్యోగులూ, స్కీమ్ వర్కర్లు పార్టీలు, సంఘాలకు అతీతంగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. అంతే కాకుండా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతిన బూనారు. మేడే రోజున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. మేడే పురస్కరించుకుని గతంలో నిర్వహించిన పోరాటాలను గుర్తు చేసుకుని స్ఫూర్తిని పొందారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. కార్మిక సంఘాలు దశాబ్దాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్న విషయం విధితమే. ట్రేడ్ యూనియన్ చట్టం, పారిశ్రామిక విధానాల చట్టం,ఫ్యాక్టరీ చట్టం, ప్రావిడెంట్ ఫండ్ చట్టం వంటివి రద్దు చేస్తున్నారు. ఈ చట్టాల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టబోయే సమ్మెకు సన్నద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

తుని పంచాయితీకి తెర

తుని మున్సిపాలిటీలో నెలకొన్న పంచాయితీకి ఎట్టకేలకు తెరపడింది. తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు ఏకగ్రీవమైంది. గతంలో వైసిపి సర్కారు హయాంలో ఈ మున్సిపాలిటీలో అన్ని స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది. అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. దీంతో మున్సిపాలిటీపై పట్టుకోసం అక్కడి టిడిపి నాయకులు నానా రచ్చచేశారు. పలుమార్లు వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకున్నారు. ఒక్క కౌన్సిలర్ కూడా లేనప్పటికీ నాయకులే సమావేశాన్ని అడ్డుకోవడం గమనార్హం. చివరికి చైర్‌పర్సన్ సైతం రాజీనామా చేసేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. ఎట్టకేలకు కొంత మంది కౌన్సిలర్లను చేజిక్కించుకున్న కూటమి నాయకులు తాజాగా అక్కడ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా తమ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా పావులు కదిపారు. ప్రస్తుతం ఇక్కడ చైర్మన్‌గా నార్ల భువనేశ్వరిసుందరి, వైస్ చైర్మన్‌గా ఆచంట సురేష్ ఎన్నికయ్యారు.

డిసిసిబి పీఠంపై తొలగని ఉత్కంఠ

ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డిసిసిబి) చైర్మన్ పదవిపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని డిసిసిబి చైర్మన్ల జాబితాను ప్రకటించిన విషయం విధితమే. అయితే జిల్లాతో పాటు మరో రెండు జిల్లాల చైర్మన్ల ఖరారుపై సందిగ్ధత నెలకొంది. కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, టిడిపి ముఖ్యనేతలు పోటీపడటమే ఈ పరిస్థితికి కారణమని



తెలుస్తోంది. జనసేన పార్టీ నుంచి పిఠాపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు ఇస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేనకు, తూర్పుగోదావరి జిల్లాలో డిసిసిబి అధ్యక్ష పదవి టిడిపికి ఇచ్చేందుకు తొలుత పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే మారిన సమీకరణల నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా డిసిసిబి చైర్మన్ పదవి టిడిపిని వరించింది. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా డిసిసిబి పదవి జనసేనకు కేటాయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నేడో, రేపో దీనిపై అధికారిక ప్రకటన కూడా వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణుల్లో ఆశిస్తున్నాయి.

కోనసీమలో 'సింహాచలం' విషాదం

విశాఖ జిల్లా సింహాచలం దేవస్థానంలో గోడకూలి పలువురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో విషాదం నెలకొంది. చేతికందొచ్చిన కుమారులు దైవదర్శనానికి వెళ్లి మృతులుగా తిరిగిరావడాన్ని వారి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్కడ గోడ నిర్మించిన కాంట్రాక్టరే అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 'ప్రసాద్' పథకంలో పలు అభివృద్ధి పనులు చేజిక్కించుకున్నారు. వర్షానికి నానడం వల్లే గోడకూలిందని కమిటీ తేల్చినప్పటికీ, గోడ నాణ్యతా పనులపై చర్చ జరుగుతోంది.



రోగులకు అందిస్తున్న వైద్యంపై మాట్లాడుతున్న ఎమ్‌ఆర్‌పిఎస్ నాయకులు జయరాజు

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం

ఎంఆర్‌పిఎస్ నాయకులు జయరాజు

ప్రజాశక్తి - మండపేట

మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంఆర్‌పిఎస్ నాయకులు దూళి జయరాజు అన్నారు. శనివారం మండపేటలో ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండపేటకు చెందిన కుందేటి సత్తిబాబు, ఖండవల్లి ఆనంద్, ఇద్దరు కూలీలు కాంక్రీట్ వర్క్ చేసేందుకు మోటార్ సైకిల్ పై ఉదయం మండపేట నుంచి అనపర్తి పనికి వెళ్తుండగా మండపేట పెద్దకాలువ వంతెన వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి ఈ విషయం తెలుసుకున్న మేస్త్రి చిట్టిబాబు 108 సహాయంతో మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు ధూళి జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కనీసం మానవత్వం లేకుండా పట్టించుకోలేదని ఆరోపించారు. డాక్టర్ చేయవలసిన వైద్యాన్ని ఎంఎన్‌ఒ చేస్తూ రోగులకు కుట్లు వేస్తున్నారన్నారు. వైద్యం వికటించి ప్రమాదం జరిగితే ఎవరు సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. ఇక్కడి వైద్యులు విధినిర్వహణలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజేష్ చౌదరికి ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

ఎన్‌టిఆర్ సినీ వజ్రోత్సవాల సందర్భంగా గుమ్మిలేరుకి చెందిన రెడ్డి రాజేష్ చౌదరికి ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం లభించింది. పాన్ ఇండియా, ఫిలంత్రోపిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటున్న వారి సేవలకు గుర్తింపుగా డాక్టర్ ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారాల ప్రదాన కార్యక్రమం శనివారం విజయవాడలో నిర్వహించారు. డాక్టర్ ఎన్‌టిఆర్ విగ్రహంతో పాటు ప్రతి ఏడాది జయంతి, వర్ధంతిలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్‌టిఆర్ అభిమానిగా గుర్తింపు పొందిన రాజేష్ చౌదరిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డును శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా సత్కరించి ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం జ్ఞాపికను రాజేష్ కు అందజేశారు. ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం అందుకున్న రెడ్డి రాజేష్ ను గుమ్మిలేరు కాకతీయ యూత్ నాయకులు గుణ్ణం శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు, రెడ్డి రుద్రయ్య చౌదరి, యాదగిని సతీష్, ముత్యాల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జర్నలిస్టుల సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎపియుడబ్ల్యుజె) డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్ అధ్యక్షతన శనివారం రామచంద్రపురంలో మహాసభలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మంత్రి సుభాష్ మాట్లాడుతూ హెల్త్ కార్డులు పునరుద్ధించటంతో పాటు, అర్హులైన వారికి అక్రిడిటేషన్లు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అందేలా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్, కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంపీపీ అంబటి భవాని, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి మండేలా శ్రీరామమూర్తి, రామచంద్రపురం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్.దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో అవసరం

ప్రజాశక్తి - మండపేట

పాత్రికేయుల సేవలు సమాజానికి అవసరమని పిఎంపిల జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కోనసత్యనారాయణ అన్నారు. శనివారం మండపేట టౌన్ హాల్ లో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పిఎంపి అసోసియేషన్‌ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అవగాహనా సదస్సులో మండపేట, ఆలమూరు, రాయవరం, మండలాలకు చెందిన పిఎంపిలు సభ్యులు పాల్గొన్నారు. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పాత్రికేయులును ఘనంగా సన్మానించారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన జివిఎస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రామ్ గోపాల్ తేజ, న్యూరో సర్జన్ అద్దేపల్లి శ్యామ్ సుందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాణిక్యాంబ వివిధ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఎంపి రాష్ట్ర మీడియా కన్వీనర్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, కార్యదర్శి సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారి మట్టా వీరబాబు, గౌరవధ్యక్షులు బీవీ రమణ,మండల కార్యదర్శి ఇరవాడ రవికుమార్, కోశాధికారి వీకే రాజు, పీఎంపీలసభ్యులు, పాల్గొన్నారు.

చేనేత రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నామినేటెడ్ పాలక వర్గంలో చేనేత రంగానికి సంబంధించిన డైరెక్టర్ కు అవకాశం ఇవ్వాలని అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ సలహాదారు చింతా శంకరమూర్తి కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది కి ఉపాధి కన్పిస్తోంది చేనేత పరిశ్రమ అని గుర్తు చేశారు. జిల్లా సహకార బ్యాంక్ పాలక వర్గం నామినేటెడ్ కు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో చేనేత సొసైటి నుంచి ఒక డైరెక్టర్ ను నామినేటెడ్ చేయాలని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లా చేనేత పరిశ్రమకు పట్టుకొమ్మ అటువంటి చేనేత పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనుభవజ్ఞులైన చేనేత నాయకుల కు కేంద్ర సహకార బ్యాంకు లో స్థానం కల్పించి చేనేత పరిశ్రమను ఆదుకొవాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎప్పటి నుండో ఇద్దరు చేనేత డైరెక్టర్ లను ఎంపిక చేసే సాంప్రదాయం వుంది,ఈసారి కూడా అదే సాంప్రదాయము కొనసాగించాలని కోరారు.కావున ప్రభుత్వం నామినేట్ చేసే కమిటీ లో చేనేత వర్గమునకు ప్రాధాన్యత ఇచ్చి చేనేత ను గౌరవించాలని కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల, ఆర్‌డిఒ డి.అఖిల

పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

గోదావరి పుష్కరాలను 2027 లో విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు. అన్నారు. 2027 లో రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. శనివారం రామచంద్రాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో వచ్చే గోదావరి పుష్కరాలకు సంబంధించి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలలో ఉన్న పుష్కర ఘాట్ల లో మరమ్మతులు, వసతుల కల్పన పై ఎంఎల్ఎ జోగేశ్వరరావు, రామచంద్రాపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జోగేశ్వరరావు మాట్లాడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ . గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పుష్కర ఘాట్లలో ఏర్పాటు చేయాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో పుష్కర ఘాట్ లను పరిశీలించి తమ శాఖల పరిధిలో కల్పించాల్సిన వసతులపై ఓ అంచనాకు రావాలన్నారు. పుష్కర ఘాట్లు మరమ్మతులు, వసతుల కల్పనపై అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో మరో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. ఆర్‌డిఒ డి.అఖిల మాట్లాడుతూ.. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో కె. గంగవరం మండలంలో 14, కపిలేశ్వరపురం మండలంలో 8 పుష్కర ఘాట్లు ఉన్నాయన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ప్రజలు పుష్కర పుణ్య స్నానాల కోసం ఇతర జిల్లాలకు వెళ్లకుండా ఇక్కడే అవసరమైన వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరూ వారి పరిధిలోని పుష్కర ఘాట్లకు వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు, ఏర్పాట్లపై అంచనాలు తయారు చేయాలన్నారు. అంచనాలు త్వరగా తయారుచేసి ఆర్‌డిఒ కార్యాలయానికి సమర్పిస్తే..వాటిని క్రోడీకరించుకొని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. త్వరితగతిన అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తే నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులందరూ ప్రజా ప్రతినిధులతో చర్చించి అంచనాలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో కపిలేశ్వరపురం, కె.గంగవరం ఎంపిడిఒలు చిన్నారావు, శ్రీనివాస్, రెవెన్యూ ఇరిగేషన్ ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ ఫిషరీస్ ఫైర్ డిపార్ట్మెంట్ల. అధికారులు తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు గ్రామ సందర్శనలో శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన సమస్యలు పరిష్కారముపై అధికారులు దృష్టి సారించాలని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ఆదేశించారు. పంచాయతీ కార్యాలయములో సర్పంచ్ గౌసుమోహిద్దీన్ అధ్యక్షతన అధికారులతో కలిసి గ్రామ సమస్యల పై సమీక్షించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా యానాది కాలనీ వాసులు ఇళ్లకు పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు కాలనీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చిన వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఎఇని ఆదేశించారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ట్యాంకర్ తో వాటర్ సప్లై చేయాలి అని పంచాయతీ అధికారిని, కొన్ని కుళాయిలు ఏర్పాటు చేయాలని ఆర్. డబ్ల్యూ అధికారులకు సూచించారు. తదుపరి శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు టి టిడి కళ్యాణ మండపం మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, ఆర్‌టిసి బస్ షెల్టర్ ఆక్రమణలు తొలగించాలని, డిఆర్‌డిఎ బిల్డింగ్ లో దిగబడిపోయిన ఫ్లోరింగ్ సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు స్థానిక ఎన్‌డిఎ నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలతో కలిసి రోడ్లు, విద్యుత్, మంచినీరు, డ్రెయినేజీ సమస్యల పై సమీక్షించారు. గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, మండల టిడిపి అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



బౌద్ధ క్షేత్రం ప్రాముఖ్యత పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డికి వివరిస్తున్న భూపతి

ఆదుర్రు బౌద్ధ స్తూపం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - మామిడికుదురు

చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఆదుర్రు బౌద్ధ స్తూపాన్ని శనివారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సందర్శించారు ఈ స్తూపం బౌద్ధ ధర్మ వికాసానికి నిదర్శనముగా నిలుసుందన్నారు బుద్ధ విహార ట్రస్ట్ కార్యదర్శి ఎస్ ఎస్ ఆర్ భూపతి స్తూపం ప్రాధాన్యత దాని గొప్పతనాన్ని ఎంఎల్ఎకు వివరించారు. బౌద్ధ స్తూపాన్ని పర్యాటకముగా తీర్చిదిద్దేందుకు కషి చేయాలని కోరారు ఆయన వెంట సర్పంచ్ బి.శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు

జిల్లాలో సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణ

ప్రజాశక్తి - అమలాపురం


విద్యార్థిని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవు ల్లో విద్యార్థులు పాఠశాల నుంచి దూరం కాకుండా, వేసవి వేడిమి ప్రభావానికి లోనవకుండా ఉండేందుకు, జిల్లాలో విద్యా శాఖ సూచనల మేరకు జిల్లాలోని వివిధ సబ్జెక్ట్ ఫోరమ్ అధ్యక్షులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి తొమ్మిది కేంద్రాల్లో సమ్మర్ క్యాంపులు ఏప్రిల్ 24 నుంచి మే 10వ తేదీ వరకు విజయవంతంగా కొనసాగుతు న్నాయన్నారు.ఈ సమ్మర్ క్యాంపులు జిల్లా ప్రస్తుత విద్యా రంగంలో వినూత్న విధానం గా నిలుస్తున్నా యన్నారు. అమలాపురం, మమ్మిడివరం, రామచంద్ర పురం, ఏడిద, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల కేంద్రాలలో ఈ శిక్షణా తరగతులు కొనసాగుతు న్నాయన్నారు. ఈ తరగ తుల్లో విద్యార్థులకు సబ్జెక్టుల ప్రాథమిక భావనలు, హ్యాండ్ రైటింగ్ మెరుగుదల, డ్రాయింగ్ నైపుణ్యాలు, శారీరక వ్యాయామాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణ వంటి అంశాలలో నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శిక్షణలు అందించ బడుతున్నాయని అన్నారు. ప్రతి కేంద్రంలో 70 మందికి పైగా విద్యార్థులు హాజరై ఉత్సాహంగా పాల్గొనడ మే కాకుండా, వారి ప్రతిభ ను చాటి చూపుతున్నారన్నారు. మే 9న 'కెరీర్ గైడెన్స్' పేరుతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఇందులో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యా ఉద్యోగావకాశాలపై రిసోర్స్ పర్సన్లు సమగ్రం గా మార్గనిర్దేశనం చేస్తారని అన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ తర్వాత తీసుకునే కోర్సులు, భవిష్యత్ అవసరాలు వంటి కీలక అంశాలపై స్పష్టతనిస్తూ మార్గ దర్శనం ఇవ్వనున్నారని అన్నారు. మే 10న శిక్షణా తరగతులను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించనున్నామని అన్నారు. అదే విధంగా ఈ సమ్మర్ క్యాంపుల్లో పాల్గొన్న పదవ తరగతి విద్యార్థులలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను గ్రామ పెద్దలు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించనున్నారని అన్నారు. ఈ ప్రోగ్రామ్‌ను సమర్థ వంతంగా సమన్వయం చేయడంలో జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, అకడమిక్ మానిట రింగ్ ఆఫీసర్ పి.రాంబాబు, ఉప విద్యాశాఖ అధికారు లు రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం వారు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అంతేగాక, జిల్లా పరీక్షల విభాగం నుంచి కమిషనర్ ఆఫ్ నేషనల్ బీర హనుమంతరావు వివిధ మండలాల మండల విద్యా శాఖ అధికారులు సబ్జెక్ట్ ఫోరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కూడా ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్య తను శ్రద్ధగా నిర్వహిస్తూ, శిక్షణా శిబిరాల విజయ వంతమైన అమలులో తన వంతు సహకారం అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, దాతల సహకారంతో ప్రతి రోజూ స్నాక్స్ అందించడం విశేషం. ఈ సమ్మర్ క్యాంపులు విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించడంలో పాఠశాల విద్యాశాఖ వైజ్ఞానిక, ఆచరణాత్మక దిశగా ముందుకు తీసుకెళ్లే చక్కటి చర్యగా నిలుస్తున్నాయన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు శనివారం ప్రజాప్రతినిధులు అందజేశారు.

రావులపాలెం: స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 25 మందికి రూ.18,44,428 మంజూరయ్యాయన్నారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబుకు ఎంఎల్ఎ సత్యానందరావు కృతజ్ఞతలు తెలిపారు. **మండపేట:** స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే జోగేశ్వరరావు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవలె



రావులపాలెంలోచెక్కులు అందచేస్తున్న ఎంఎల్ఎ బండారు

హాస్పటల్స్ లో వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 53 మందికి రూ.30,09,790లు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయ్యాయి. ఈ చెక్కులను ఎంఎల్ఎ వేగుళ్ల చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక హుండీల ఆదాయం రూ. 21.52 లక్షలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతరలో భాగంగా గత నెల ఏప్రిల్ 9 నుంచి మే 3 వరకు 25 రోజులకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 9 హుండీలను లెక్కించారు. రూ.21,52,499 ఆదాయం దేవస్థానానికి సమకూరినట్లు ఆలయ ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి శనివారం తెలిపారు. ఈ లెక్కింపును రామచంద్రపురం దేవాదాయ శాఖ తనిఖీదారులు బాలాజీ రామ్ ప్రసాద్ సమక్షంలో దేవస్థానం సేవ కమిటీ సభ్యులు గని వెంకట్రావు, దేవస్థానం మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు సహాయ సహకారాలతో పెద్దపళ్ల బ్రాంచ్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పర్యవేక్షణలో కమిటీ సభ్యులు లెక్కించారని తెలిపారు. అలాగే ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులు జరుగుతున్న సందర్భంగా యాత్రికులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఇఒ వీర్రాజు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వివిధ సేవా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ అఖిలభారత రైతు కూలీ సంఘం ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలనీ జిల్లాలో దళారీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అరికట్టాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమ శంకరం, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు అన్నారు. జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు కళ్లాలలో ఉన్న ధాన్యం, ఇంకా కోత కొయ్యవలసిన పంట తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణమే ప్రభుత్వం పండించిన పంటకు గిట్టుబాటు ధర ప్రకటించి , రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు.